క్లుప్తంగా

నేడు పూడిమడకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

అచ్యుతాపురం (అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పూడిమడక సచివాలయం-1 పరిధిలో ఈ నెల 27న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సచివాలయం పరిధిలోని ప్రజలు శిబిరంలో పాల్గొనాలని ఆమె సూచించారు.

ఫార్మా వ్యర్థాలతో స్థానికుల ఇబ్బందులు

మునగపాక : మండలంలోని పల్లపు ఆనందపురంలో ఫార్మా వ్యర్థాలు తీసుకొచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మునగపాక పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన టీడీపీ నేత ఉస్తేలునాయుడు కుమారుడు పరవాడలోని ఫార్మా కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాలను తరలించేందుకు కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. లారీ ద్వారా తన పొలంలో జేసీబీతో గోతులు తవ్వించి వ్యర్థాన్ని నిల్వ ఉంచేందుకు ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న స్థానికులు వ్యర్థాల వలన దుర్వాసనతో పాటు ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని ఆందోళనకు గురై మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అలీ షరీఫ్ వ్యర్థాలు ఎక్కడి నుంచి తీసుకు వచ్చారనే విషయమై ఆరా తీసేందుకు ఫార్మా కంపెనీకి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

మొహం చాటేసిన వరుణుడు

రాంబిల్లి: వరుణుడు మొహం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో తుపాను ఏర్పడుతుందని, దీని ప్రభావంతో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆనందించారు. అయితే వర్షం పడకపోవడంతో రైతులు నిరాశ చెందారు. వర్షాలు పడక పలుచోట్ల వరి పొలాలు ఎండిపోతున్నాయి. అంతే కాకుండా చీడపీడల ఉధృతి పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

యలమంచిలి : పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం యలమంచిలి పట్టణం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పట్టణ ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లైంగిక వేధింపుల నుండి మహిళలు, చిన్నారులకు రక్షణ-సామాజిక పాత్ర అనే అంశంపై విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వారోత్సవాలను పురస్కరించుకుని ఉన్నతాధికారుల అదేశాలు మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత పన్ను చెల్లింపులు షురూ

అనకాపల్లిటౌన్: పన్నులు చెల్లించేందుకు నగదు రహిత లావాదేవీలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జోనల్ కమిషనర్ ఎస్.వెంకట రమణ తెలిపారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయంలో గురువారం జోన్ పరిధిలోని 27 సచివాలయాల అడ్మిన్లకు పీవోఎస్ యంత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఇంటి, కుళాయి, ఖాళీ స్థల పన్నులు చెల్లించే వారు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ పేమెంట్లు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయాల అడ్మిన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మరో అన్నవరంగా సుంకరమెట్ట సత్యదేవుని ఆలయం

అనకాపల్లిటౌన్: మరో అన్నవరంగా సుంకరమెట్ట సత్యనారాయణస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దుతానని ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు అన్నారు. ఆలయ ఆవరణలో గురువారం ప్రహరీగోడ నిర్మాణ స్థలాన్ని పాలకవర్గ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఆలయ ఆవరణాన్ని హరితవనంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ఫర్నిచర్ సౌకర్యంతోపాటు రానున్న కార్తీకమాసంలో భక్తులకు వీలుగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆలయ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను జేసీబీ సాయంతో తొలగించారు.

అందరికీ ఆరోగ్యం.. సీఎం లక్ష్యం

- ఎమ్మెల్యేలు యూవీ రమణమూర్తిరాజు, గొల్ల బాబూరావు
- ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సుపరిపాలన అందిస్తోన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాహితం కోరుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. నేరుగా ప్రజల వద్దకు వైద్యులు వెళ్లి తనిఖీలు చేసి.. వ్యాధులను గుర్తించి వైద్యం అందించేలా కార్యక్రమానికి రూపకల్పన చేశారు. పేదలు ఏనాడూ చూడని కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేస్తున్నారు.



నాగవరంలో వైద్య సేవల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



పి.ధర్మవరంలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

మునగపాక : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నాగవరంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. విభాగాల వారీగా ప్రజలకు అందుతున్న సేవలపై వైద్యాధికారి విమలగిరిని అడిగి తెలుసుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నాగవరం, మల్లవరం సర్పంచ్‌లు అప్పికొండ సత్యవతి, ఇందల హేమలత, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాసరి అప్పారావు, జెడ్పీటీసీ కో-ఆప్షన్ మెంబర్ మరిసా రమణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, దుప్పుతూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు, పాలసంఘం అధ్యక్షుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కాగా బొడ్డేడ ప్రసాద్ ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



నాగవరం శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బొడ్డేడ ప్రసాద్

రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం

ఎస్.రాయవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందాల్సిందేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పి.ధర్మవరంలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్యులతో నేరుగా సమీక్షించారు. నిత్యం గ్రామాల్లో నిర్వహిస్తున్న క్యాంపుల్లో రోగులకు అందించిన వైద్యం, అనంతరం చేస్తున్న పర్యవేక్షణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ గ్రామాల్లో కార్పొరేట్ వైద్య అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు.

303 మందికి వైద్య సేవలు

శిబిరంలో 303 మంది రోగులు వైద్య సేవలు పొందినట్లు వైద్యురాలు రాజేశ్వరి తెలిపారు. ఇందులో 12 మందిని ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిమిత్తం పట్టణ ఆస్పత్రికి, కళ్లద్దాలకు 87 మందిని, క్యాటరాక్ట్ శస్త్రచికిత్స నిమిత్తం 14 మందిని విశాఖ ఆస్పత్రులకు తరలిస్తున్నట్టు చెప్పారు. పిల్లల వైద్య నిపుణులు కె.మువ్వని కార్తికేయ, మహిళా వైద్య నిపుణులు జయలక్ష్మి చికిత్స అందించగా డాక్టర్ వాసంతి, షాబాణం సాధరణ వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.

పేదల చెంతకు మెరుగైన వైద్యం

కోటవురట్ల: పేదలకు వైద్యం భారం కాకూడదనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. యండపల్లిలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ జానకమ్మ, సర్పంచ్ పావని ప్రారంభించారు. ఉదయశ్రీ శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలను పర్యవేక్షించారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదలు వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బంది పడకుండా ప్రభుత్వమే వైద్యులను పంపి మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. ఈ శిబిరాలకు మంచి స్పందన వస్తోందని, రోగులు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ 287 మంది రోగులు పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు. 120 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకోగా.. 51 మందికి కళ్లద్దాలు అవసరం ఉన్నట్టు చెప్పారు. 93 మందిని ప్రత్యేక వైద్యనిపుణులు పరీక్షించారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



యండపల్లి శిబిరంలో కేస్ షీట్, మందులు అందిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, నాయకులు



నాగవరంలో ఓపీ కోసం వేచి ఉన్న రోగులు

390 మందికి వైద్య సేవలు

పాయకరావుపేట: మండలంలోని గోపాలపట్నంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 390 మంది వైద్య సేవలు పొందారు. రోగులకు వైద్య సిబ్బంది రక్త పరీక్షలు, కంటి, బీపీ, సుగర్, టైఫాయిడ్, మలేరియా టెస్ట్‌లు నిర్వహించారు. మంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.స్వరాజ్యం, సాధారణ వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ నైజల్‌జోష్ ఆర్థోపెడిక్ సమస్యలపై, డాక్టర్ ఈశ్వర్ ప్రసాద్ ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించారు. కంటి రోగులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. రోగులకు మెరుగైన వైద్యం కోసం అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు వైద్య శిబిరాన్ని సందర్శించి, రోగులను వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులను ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పన్నీరు పాపారావు, గ్రామ కార్యదర్శులు వై.వి.సత్యనారాయణ, బి.ఎ.బి.ఎల్.మూర్తి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కాగితలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజలకు చేరువగా వైద్యం..

అచ్యుతాపురం (అనకాపల్లి): ప్రజలకు చేరువగా వైద్య సేవలందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగాన్ని బలోపేతం చేశారని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని మడుతూరు సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా స్టాల్స్‌ని పరిశీలించి షుగర్ పరీక్ష చేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆస్పత్రులను అభివృద్ధి చేయడం, వైద్య సిబ్బందిని అవసరమైన మేరకు నియమించడం, తగిన విధంగా బడ్జెట్ కేటాయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు వైద్య సేవలందిస్తుందని తెలిపారు. పెద్ద పెద్ద రోగాలున్న వారికి కార్పొరేట్ తరహా వైద్య సేవలందించి, ఆ ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. సర్పంచ్ మోటూరు సంజీవి, కో-ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, ఎంపీటీసీ శనివాడ జువ్వాల నాయుడు, దేశంశెట్టి శంకర్‌రావు, కోన బుజ్జి, బలిరెడ్డి శ్రీను, పల్లె శేషగిరి, కూండ్రపు విమలనాయుడు, లాలం శ్రీను, చోడపల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

600 మందికి వైద్య సేవలు

నక్కపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. కాగిత సచివాలయం పరిధిలో గురువారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునే స్తోమత లేనివారి కోసం జగనన్న ప్రభుత్వం ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కాగిత, న్యాయంపూడి, వెదుళ్లపాలెం గ్రామాల నుంచి సుమారు 600 మంది వచ్చి వైద్య సేవలు పొందారు. రక్త పరీక్షలు, సుగర్, బీపీ, యూరిన్, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా అవ్వాతాతలకు కంటి వైద్య పరీక్షలు చేశారు. పేషెంట్లకు కేస్ షీట్లు, ఉచితంగా మందులు అందజేశారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని వైద్యులు తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల స్టాల్‌ను నాయకులు పరిశీలించి ప్రశంసించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెదుళ్ల వరలక్ష్మి, రెడ్డి వరహాలు, రాజేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేడ్కర్, స్థానిక నాయకులు పోతంశెట్టి బాబ్జి, దేవవరపు శివ, వెదుళ్ల వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



గోపాలపట్నం శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, పరిశీలిస్తున్న నాయకులు



మడుతూరులో సురక్ష శిబిరానికి విచ్చేసిన స్థానికులు



మడుతూరులో పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనాలు



ఘటాలతో ఊరేగింపులో మహిళలు, నిమజ్జనానికి తరలిస్తున్న దుర్గాదేవి అమ్మవారు

మునగపాక :మండలవ్యాప్తంగా దుర్గాదేవి అమ్మవారి నిమజ్జనాలు ఘనంగా ముగిసాయి. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో ఈ ఏడాది అమ్మవారి విగ్రహాలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా నిమజ్జనాన్ని కూడా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళల కోలాటాలు, ఘటాల ఊరేగింపు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. నిమజ్జనాల సందర్భంగా ఎస్ఐ మహ్మద్ అలీ షరీఫ్ తగు చర్యలు తీసుకున్నారు.

నక్కపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేవవరం, నక్కపల్లి, కాగిత, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం, వేంపాడు తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను సందడిగా ఊరేగించారు. నేల వేషాలు, డప్పువాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య నిమజ్జన కార్యక్రమం జరిగింది. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తుల సమక్షంలో ఊరేగింపు నిర్వహించి దుర్గమ్మ విగ్రహాలను నిమజ్జనం చేశారు. గురువారం దేవవరంలో 25వ దేవీ నవరాత్రులను ఘనంగా నిర్వహించి నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు. కుర్రకారు నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరి నిమజ్జనం..

రాంబిల్లి: మండలంలోని దిమిలి గ్రామంలో గురువారం రాత్రి బాలా త్రిపుర సుందరీదేవి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలతో ఆకట్టుకున్నారు. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం శారదా నదిలో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



20 ఏళ్ల తరువాత కలుసుకున్న పి.ధర్మవరం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం: పి.ధర్మవరం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం గ్రామంలో ఒక చోట కలుసుకుని ముచ్చటించారు. 2001-2002 బ్యాచ్‌లో 10వ తరగతి పూర్తి చేసుకున్న సుమారు 50 మంది విద్యార్థులు రోజంతా సందడిగా.. ఆనందంగా గడిపారు. 20 ఏళ్ల తరువాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సంతోషించారు. అలనాటి మధుర జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు ప్రయోజన చేకూరే వస్తువులు వితరణ చేశారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

యలమంచిలి : మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. గురువారం ఆయన యలమంచిలి వ్యవసాయ కార్యాలయంలో జరుగుతున్న నాలుగు మండలాల డివిజన్ స్థాయి వ్యవసాయ సహాయకుల శిక్షణ తరగతులను సందర్శించారు. ప్రస్తుతం వరి, ఇతర పంటలపై ఆశించిన చీడపీడల నివారణకు తక్కువ ఖర్చుతో మేలైన యాజమాన్య పద్ధతులు, రైతుభరోసా, పీఎం కిసాన్ గ్రామీణ విత్తనోత్పత్తి పథకం, వైఎస్సార్ పొలం బడి, ఈ పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. అలాగే రైతుల నుండి పంట నమోదుకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిరీష మాట్లాడతూ వరి, నువ్వు పంటపై ఆశించిన ఆకు ముడత, ఆకు ఎండు తెగులు, పాడ తెగులు, సుడిదోమ వంటి వాటిని ముందుగా గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఏడీఏ రవి ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల అభివృద్ధి సంక్షేమ పథకాలను రైతులకు వివరించాలన్నారు. అనకాపల్లి జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ శ్రీధర్, మండల వ్యవసాయాధికారి మోహనరావు, నాలుగు మండలాల వ్యవసాయధికారులు సుమంత, సౌజన్య, శంకర్ గోవింద్, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, ఏఈవో సూర్యనారాయణ, దేవుడు, వరలక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



యలమంచిలి పురపాలక సంఘం

యలమంచిలి (అనకాపల్లి రూరల్): యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. 15 సాధారణ అంశాలు, మరికొన్ని అనుబంధ అంశాలతో పాటు కొన్ని టేబుల్ అజెండాలు సభ్యుల ముందుకు రానున్నాయి. వీటిని చర్చించి సభ్యులు ఆమోదించనున్నారు. పట్టణంలోని కొమ్మాయిగుండం చెరువు పక్కనున్న 5 దుకాణాల లీజు ముగియడంతో వాటి లీజును మరో మూడేళ్లు పొడిగించడానికి లీజుదారులు చేసుకున్న దరఖాస్తులను ఆమోదించడం, శ్రీరాంనగర్, తులసీనగర్, శేషుకొండ, రామారాయుడుపాలెం, కొక్కిరాపల్లి, మర్రిబంద గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన బలహీన వర్గాల ఇళ్ల కాలనీల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 7.3 కోట్ల నిధులతో వివిధ పనులు చేపట్టడానికి ఇలా మొత్తం 15 అజెండాలో అంశాలను ఇప్పటికే సభ్యులందరికీ పంపించారు. వీటన్నింటిపై సభ్యులు చర్చించనున్నారు. ప్రతిపక్ష టీడీపీకి ఒకే ఒక సభ్యుడు మాత్రమే ఉండడంతో అజెండాలోని అంశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం పొందే అవకాశం ఉంది.

వేడుకగా మరిడిమాంబ ఉత్సవం

కశింకోట: కశింకోటలో గురువారం రాత్రి మరిడిమాంబ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక గవరపేటలోని కనక మహాలక్ష్మి వీధి, కస్పావీధి, కాశీభట్ల వీధుల్లో ఉన్న మరిడిమాంబ ఆలయాలను భక్తులు సందర్శించి, అమ్మవారికి పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. గవరపేటలోని మరిడిమాంబ ఆలయాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ తరపున దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో ఆయన్ని సత్కరించారు. ఆలయాలను ఉత్సవం సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, సభ్యులు కాండ్రేగుల నాగేష్, దాడి రాము, స్వామి పాల్గొన్నారు.

ఘనంగా హిందూ ధర్మ ప్రచార వారోత్సవాలు



నూకాంబిక అమ్మవారి బాలాలయంలో భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు హిందూ ధర్మ ప్రచార వారోత్సవాలను ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయం ఆవరణలో భరత నాట్య ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు సప్పా భారతి భాగవతారిణిచే హరికథ, రేజేటి చక్రవర్తి ఆచార్యులచే ప్రవచనములు, కొణతాల బోసు బృందంచే భక్తి సంగీతాలు, శ్రీ వెంకట సాయి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ, కాళ్లకూరి సుజాత బృందం వారిచే భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. శుక్ర, శనివారాలు పోతురాజు సిండికేట్ ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు, పెతకంశెట్టి సుజాతనాయుడు ఆధ్వర్యంలో శ్రీ నూకాంబిక అమృతవర్షిణి బృందంచే కోలాటాలు, గౌరీపరమేశ్వరి మహిళా బృందం వారిచే లలితా స్తోత్ర పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.